- రైతులు, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బోనస్ ఇవ్వరు.. కానీ ఓట్లకు మాత్రం డబ్బులు పంచుతారు..
- వ్యవసాయంపై కనీస అవగాహన లేని సీఎం రేవంత్‌రెడ్డి
- భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడంగల్ ఎత్తిపోతలకు నీటిని తరలిస్తే అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


మక్తల్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఆరబోసిన ధాన్యాన్ని రైతులతో కలిసి పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

# మాటమార్చడమే కాంగ్రెస్ నైజం

మక్తల్ టౌన్, మే 16 : ఎన్నికల ముందు ధాన్యానికి బోనస్‌గా రూ.500 చెల్లిస్తామని చెప్పి నేడు సన్నరకానికి మాత్రమే బోనస్ చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి రైతులు, ప్రజలను మోసం చేశారని, మాటమార్చడమే కాంగ్రెస్ నైజమని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సన్నరకంతోపాటు దొడ్డు రకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మక్తల్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టెం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, క్వింటాపై రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పి నేడు మాటమార్చడం దారుణమన్నారు. వ్యవసాయంపై అవగాహన లేని వ్యక్తి రాష్ట్రానికి సీఎం అయ్యారన్నారు. హామీలను మరిచి పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఓటుకు రూ.500 ఇచ్చి కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో చాలా మంది రైతులు దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారని, కానీ సన్నరకానికి మాత్రమే బోనస్ చెల్లిస్తామని చెప్పి వారిని నిలువునా మోసం చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే రైతులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడంతోపాటు 24 గంటలపాటు ఉచితంగా కరెంట్ అందించి వ్యవసాయాన్ని పండుగలా మార్చామన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోయాయని, రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడంతోపాటు కరువు పరిస్థితులు దాపురించాయన్నారు. దీంతో చాలా మంది రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై అవగాహన లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మక్తల్ మండలం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడంగల్ ఎత్తిపోతల పథకానికి పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకెళ్తానని దొంగ జీవోలను తీసుకొచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నీటిని తీసుకెళ్తే తాము కచ్చితంగా అడ్డుకుంటామన్నారు. అభివృద్ధికి తోడ్పడితే మీ వెంబడి అడుగేస్తానని, రైతుల నోట్లో మట్టికొట్టి కొడంగల్‌కు నీటిని తరలించే ప్రక్రియ చేపడితే ప్రాణాలు తెగించైనా నీటి తరలింపును అడ్డుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి తాసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాగనూరు మాజీ జెడ్పీటీసీ సరితామధుసూదన్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఎల్లారెడ్డి, కౌన్సిలర్ మొగులప్ప, పట్టణ అధ్యక్షుడు హనుమంతు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, రాజుల ఆశిరెడ్డి, టీటీసీ ఆశిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జయానంద్, అన్వర్‌హుస్సేన్, నర్సింహారెడ్డి, శంకర్, ప్రతాప్‌రెడ్డి, రాజు, శివారెడ్డి, సాగర్, సాధిక్, రైతులు పాల్గొన్నారు.


వనపర్తిలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# మాట మార్చిన ముఖ్యమంత్రి

- బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి, మే 16 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ధాన్యానికి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చి నేడు సన్నరకానికి మాత్రమే చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాటమార్చి రైతులను మోసం చేస్తున్నారని బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అన్ని రకాల ధాన్యానికి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గట్టుయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ధ్యానం కొనుగోలుపై బోనస్ ఇస్తామనే హామీ కూడా ఉందని గుర్తు చేశారు. కానీ ఈ రోజు ఆ మాట మార్చి సన్న రకానికే బోనస్ ఇస్తామనడంతో కాంగ్రెస్ మోసాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు. ఇప్పటికే రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు ఇవ్వకుండా రైతులను అరిగోస పెడుతున్నదన్నారు. ఎన్నికల ముందు ప్రతి గింజనూ మద్దతు ధరతో కొంటామని, అందులో వరికి రూ.500, మొక్క జొన్నకు రూ.300, చెరుకుకు రూ.850, పప్పు ధాన్యాలపై రూ.300 నుంచి రూ.500 వరకు, పసుపు, మిర్చికి రూ.800 బోనస్ ఇస్తామని చెప్పి.. నేడు పరిస్థితులను అధ్యయనం చేస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోలు చేసి క్వింటాపై రూ.500 బోనస్ ఇవ్వాలని, లేదంటే రైతులు పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ అశోక్, ప్రధాన కార్యదర్శి రమేశ్, మండల నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సేనాపతి, కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్నయాదవ్, కెంచె రవి, నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రహీం, డానియేల్, గిరి, సయ్యద్, జమీల్, సురేశ్, రవి, నాగరాజు, శ్రావణ్‌కుమార్, యుగంధర్‌రెడ్డి, జోహెబ్, బాలయ్య, శ్రీను, రాము, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

# బోనస్‌పై బీఆర్‌ఎస్ భగ్గు

- రైతులపై మరోసారి విషంకక్కిన రేవంత్‌పై కన్నెర్ర
- రూ.500 అదనపు చెల్లింపుపై మాటమార్పు
- సన్న వడ్లకే చెల్లిస్తామని, దొడ్డు రకానికి కాదన్న ప్రకటనపై పెల్లుబికిన ఆగ్రహం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనల హోరు
- రైతులతో కలిసి రోడ్డెక్కిన గులాబీ నేతలు
- బోనస్ ఇవ్వాలని డిమాండ్

*కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడడంపై బీఆర్‌ఎస్ భగ్గుమన్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు క్వింటా ధాన్యం కొనుగోలుపై రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించి.. ఇప్పుడేమో కేవలం సన్న వడ్లకే ఇస్తామని.. దొడ్డు వడ్లకు కాదని సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా రైతులకు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసనలతో హోరెత్తించారు. మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, వనపర్తిలో గులాబీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ధర్నా చేపట్టారు. మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో నల్ల కండువాలు కప్పుకొని నాయకులు నిరసన తెలిపారు. కొల్లాపూర్, పెబ్బేరు, గద్వాల, దేవరకద్రలోనూ ధర్నా చేపట్టి.. సీఎం రేవంత్‌రెడ్డి రైతులపై మరోసారి విషం కక్కడంతో కన్నెర్ర చేశారు. కర్షకులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.*

*- మహబూబ్‌నగర్, మే 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*




మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో రైతులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన బీఆర్‌ఎస్ నాయకులు

# సీఎం రేవంత్ గద్దెదిగాలి

- మహబూబ్‌నగర్ జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య
- జడ్చర్లలో బీఆర్‌ఎస్ నిరసన

జడ్చర్ల, మే 16 : అసెంబ్లీ ఎన్నికల్లో రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి వారిని మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే గద్దె దిగాలని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని వచ్చిన వంటనే డిసెంబర్ 9వ తేదీన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా రుణమాఫీపై పూటకో మాట మాట్లాడుతూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. అదే విధంగా రైతులు పండించిన పంట ఉత్పత్తులకు బోనస్‌గా రూ.500ఇస్తామని ఇప్పుడేమో సన్నరకం ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని అంటున్నారని, దొడ్డురకాలకు కూడా బోనస్ ఇవ్వాలన్నారు.

హామీలు ఇచ్చేటప్పుడే వాటిని అమలు చేస్తామా లేదా అని ఆలోచించుకోవాలని, మీ చేతగాని తనం వల్ల రైతులు, ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల ను వెంటనే అమలు చేయాలని లేదంతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, లత, జ్యోతీకృష్ణారెడ్డి, నర్సింహులు, మురళి, ఇమ్మూ, మాజీ సర్పంచులు ప్రణీల్‌చందర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ రవి, నాయకులు శ్రీకాంత్, రం జిత్‌బాబు, సత్యం, శంకర్‌నాయక్, నాగిరెడ్డి, గిరి, శ్రీనివాస్‌యాదవ్, విజయ్, వెంకటరమణ, పర్మటయ్య, అంజిబాబు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం మొలకెత్తినా పట్టించుకోరా..?

- ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి
- దొడ్డు రకం ధాన్యానికీ రూ.500 బోనస్ చెల్లించాలి
- గ్రంథాలయ సంస్థ పాలమూరు జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 16 : కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో ధాన్యం మార్కెట్ యార్డ్‌కే పరిమితమైందని, అకాల వర్షంతో ధాన్యం మొలకెత్తి పాడైపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. అన్ని రకాల ధాన్యానికి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నల్ల కండువాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రైతు రుణమాఫీ, క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సన్న రకానికి మాత్రమే బోనస్ ఇస్తామని మాటమార్చి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇది మీ చేతగాని తనానికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. రైతులకు సమయానికి కరెంట్ ఇవ్వలేదు.. సాగునీరు లేక సరైన పంటలు పండలేదు.. కనీసం చేతికి వచ్చిన పంటనైన ప్రభుత్వం కొనుగోలు చేసి బోనస్ చెల్లించకపోతే రైతులు ఎలా బతకాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు ఎక్కడ పంట పండిస్తే అక్కడే కొనుగోలు చేశారని, ఇవాళ ఆ పరిస్థితి లేక మార్కెట్ యార్డుకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, ప్రతి గింజనూ కొనుగోలు చేయడంతోపాటు బోనస్ చెల్లించాలని లేదంటే రైతుల పక్షాన ఆందోళనలు నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, నాయకులు గోపాల్‌యాదవ్, శివరాజ్, దేవేందర్‌రెడ్డి, కరుణకర్‌గౌడ్, నరేందర్, గణేశ్, గిరిధర్‌రెడ్డి, శివకుమార్, అహ్మదుద్దీన్, రాజేశ్వర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.


గద్వాల తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# రైతులకు అండగా ఉంటాం

- గద్వాల పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్

గద్వాల, మే16 : రైతుల హక్కులను కాపాడేందుకు వారికి అండగా ఉంటామని గద్వాల పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్ అన్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం బీఆర్‌ఎస్ నాయకులు తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులు పండించిన ధాన్యానికి క్వింటాపై రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మాటమార్చడం ఎంత వరకు సమంజసమన్నారు. నియోజకవర్గంలో చాలా మంది దొడ్డు రకం ధాన్యం పండిస్తారని, ఈ విషయం తెలిసి కూడా సన్నరకం ధాన్యానికే బోనస్ ఎలా ఇస్తారన్నారు. అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్‌నాయుడు, రాధాకృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చిన్నయ్య, సత్యం, జగదీశ్‌రెడ్డి, వాసుదేవుడు, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, రఘు, లక్ష్మీకాంత్‌రెడ్డి, రంజిత్‌కుమార్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కర్షకులను గోస పెడుతున్న ప్రభుత్వం

- పెబ్బేరు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ


పెబ్బేరు, మే 16 : వ్యవసాయానికి కరెంట్, నీళ్లు ఇవ్వకుండా అన్నదాతను ఏడిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పండించిన వడ్లు కొనకుండా గోస పెడుతున్నదని పెబ్బేరు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి ఆరోపించారు. గురువారం పెబ్బేరులో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి ప్రభుత్వం మాట మార్చిందని, ధాన్యాన్ని కూడా కొనకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథంనాయుడు, వనం రాములు, విశ్వరూపం, మేకల ఎల్లయ్య, వేణుగోపాల్, సాయిరెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


పెబ్బేరులో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

# హామీలు అమలు చేయాలి

- కొల్లాపూర్ పీఏసీసీఎస్ చైర్మన్ శ్రీనివాసులు

కొల్లాపూర్ రూరల్, మే 16 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పీఏసీసీఎస్ చైర్మన్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వం అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలని కోరుతూ కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. ఈ సందర్భంగా పీఏసీసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన బోనస్ హామీతోనే రైతులు ఎక్కువ శాతం వరి పంట వేశారని, ఇప్పుడు పంట చేతికి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే రైతులకు ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. అనంతరం బోనస్ చెల్లించాలని కోరుతూ ఆర్డీవో నాగరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకుడు యాదన్నగౌడ్, నాయకులు, రైతులు ఉన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు


బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

# పాలమూరులో చిరుజల్లులు

- ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా మోస్తరు వర్షం
- కొన్ని చోట్ల ఈదురుగాలులు

జడ్చర్ల, మే 16 : జడ్చర్ల మండలంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వర్షంలో బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఆరుబయట ఉన్న ధాన్యం, మొక్కజొన్న కుప్పలు మామూలుగా తడిశాయి. అయితే వర్షపు చినుకులు ప్రారంభమవుతున్న సమయంలోనే బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ధాన్యం, మొక్కజొన్న కుప్పలపై రైతులు కవర్లు కప్పారు. దాంతో వర్షం కురిసినా వాటికి అంతగా నష్టం కలుగలేదు. ముసురు వర్షానికి యార్డు పైభాగం నుంచి వర్షపునీరు కిందకు రావడంతో కుప్పల అడుగుభాగం కొద్దిగా తడిసింది. అయితే బుధవారం కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను వ్యాపారులు ఎత్తక పోవడంతో వర్షానికి అవి తడిశాయి. పెద్దవర్షం రాకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గురువారం కురిసిన వర్షానికి వరి కోతలకు ఇబ్బందులు కలిగాయి. అదేవిధంగా చేతి కొచ్చిన వరి పైర్లు కిందపడే అవకాశం ఉన్నది.

### బిజినేపల్లిలో గాలివాన..

బిజినేపల్లి, మే 16 : బిజినేపల్లితోపాటు మండలంలోని గంగారం, వట్టెం తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలివానకు మండలంలోని మహదేవునిపేట నుంచి గంగారం వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడింది. దీంతో గంగారం, వసురాంతండా, కీమ్యాతండా, పెద్ద తండాలకు వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈదురుగాలులకు మండలంలోని పలు గ్రామాల్లో మామిడి కాయలు కూడా నేలరాలాయి.

### చల్లబడ్డ వాతావరణం..

మూసాపేట, మే 16 : వేసవి ఎండల తీవ్రతకు ఉపశమనం లభించింది. గురువారం సాయంత్రం మూసాపేటలో మోస్తరు వర్షం కురిసింది. 20 నిమిషాలపాటు వర్షం కురియగా.. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

అదేవిధంగా అడ్డాకుల, దేవరకద్ర, భూత్పూర్, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాల్లో కూడా చిరు జల్లులు కురిశాయి.


బిజినేపల్లిలో ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టు


బాదేపల్లి మార్కెట్‌లో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు